ఆలయంలో సినీ నటుడు నవదీప్

## జోగుళాంబ సన్నిధిలో సినీనటుడు నవదీప్

అలంపూర్, జనవరి 25 : అలంపూర్‌లోని ఐదో శక్తి పీఠమైన జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను గురువారం సినీ నటుడు నవదీప్ దర్శించుకున్నారు. ఆయనకు ఈవో పురేందర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించగా అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయాధికారులు, అర్చకులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ

# నాగర్‌కర్నూల్

5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 26 జనవరి 2024 | NAGARKURNOOL

## మదినిండా.. జాతీయ జెండా

- గణతంత్ర దినోత్సవం ఎందుకు జరుపుకొంటాం
- త్రివర్ణ పతాకం నియమ నిబంధనలు ఏమిటీ ?

గద్వాలటౌన్, జనవరి 25 : భారతదేశ 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు అంతా సిద్ధమైంది.. పల్లె నుంచి పట్నం దాకా శుక్రవారం జాతీయ పండుగ సంబురాల్లో పాలుపంచుకునేందుకు ప్రజలంతా తహతహ లాడుతున్నారు.. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతోపాటు విద్యాసంస్థల్లో ఏర్పాట్లు ఊపందుకున్నాయి.. గణతంత్ర దినోత్సవాన్ని పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించేందుకు జిల్లా ఉన్నతాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.. కాగా కొద్దిపాటి అజాగ్రత్తతో ఎక్కడో ఒక చోట ఏదో ఒక అపశ్రుతి చోటు చేసుకోవడం మనం చూస్తూనే ఉంటాం.. మరి అలాంటి పొరపాట్లు జరగకుండా కొన్ని విషయాలు.. జాగ్రత్తలు మనం తెలుసుకోవాలి.. అలాగే గణతంత్ర దినోత్సవం ఎందుకు జరుపుకొంటాం.. జాతీయ జెండా పతాకం నిబంధనలు ఏమిటో మనం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### గణతంత్ర దినోత్సవం వచ్చిందిలా..

మన దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. అధ్యక్షుడిగా డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ ఎన్నికయ్యాడు. తరువాత దేశానికి రాజ్యాంగం తయారు చేయడానికి రాజ్యాంగ పరిషత్ ఏర్పడింది. 1947 ఆగస్టు 29న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చైర్మన్‌గా ముసాయిదా కమిటీ ఏర్పాటైంది. రాజ్యాంగ రూపుదిద్దుకోవడానికి అంబేద్కర్‌తోపాటు ఎందరో మహనుభావులు, మేధావులు నిరంతం కృషి చేశారు. ఎన్నో దేశాల రాజ్యాంగాలను పరిశీలించి వాటన్నింటికీ భిన్నంగా ప్రజాస్వామ్య విధానంలో భారత రాజ్యాంగాన్ని రూపొందించారు. అప్పటికీ సంతృప్తి చెందక మళ్లీ అనేక సవరణలు చేపట్టారు. అనేక సవరణల అనంతరం 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. రాజ్యాంగం రూపకల్పన చేయడానికి 2 సంవత్సరాల, 11నెలల, 18రోజులు పట్టింది. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా మన రాజ్యాంగం గుర్తించబడింది. ఇలా తయారైన రాజ్యాంగాన్ని 1950 జనవరి 26న అమలు పర్చారు. దీంతో భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగా రూపుదిద్దుకున్నది. అయితే భారత జాతీయ కాంగ్రెస్ 1930 జనవరి 26న పూర్ణ స్వరాజ్‌కు పిలుపునిచ్చిన రోజు కావడంతో జనవరి 26ను గణతంత్ర దినోత్సవ రోజుగా అమలు చేశారు.

### కమిటీలో ఎవరెవరున్నారు..

రాజ్యాంగాన్ని ఏడుగురు సభ్యులతో కూడిన డ్రాఫ్టింగ్ కమిటీ తుది ప్రతిని రూపొందించింది. 1947 ఆగస్టు 29న ఏడుగురు సభ్యులతో కూడిన ముసాయిదా కమిటీ ఏర్పాటైంది. కమిటీకి బీఆర్ అంబేద్కర్ చైర్మన్ కాగా అల్లాడి కృష్ణస్వామిఅయ్యార్, ఎన్ గోపాలస్వామి, కేఎం మున్షీ, మహ్మద్ సాదుల్లా, బీఎల్ మిట్టర్, డీపీ ఖైతన్ సభ్యులుగా వ్యవహరించారు. ఆ తరువాత ఖైతన్ మరణించడంతో టీటీ కృష్ణమాచారి సభ్యుడిగా కొనసాగారు. అయితే తొలుత భారత రాజ్యాంగ ముసాయిదాను బీఎన్‌రావు రూపొందించారు. ఆ ముసాయిదాకు అనేక మార్పులు చేసి డ్రాఫ్టింగ్ కమిటీ నూతన రాజ్యాంగాన్ని రూపకల్పన చేసింది.

### పతాకానికి నియమావళి ఇలా..

జాతీయ పతాక నియమావళి అనేది భారత జాతీయ పతాక వాడకాన్ని నిర్ధేశించే చట్టాల సమహారం. 1950లో 1971లో రూపొందించిన చట్టాల్లోని అంశాలను కలిపి 2002లో ఓ సరికొత్త చట్టాన్ని రూపొందించారు. 2002 ముందు జాతీయ సెలవుదినాల్లో తప్పా మిగతా సందర్భాల్లో ప్రజలు ఎగురవేసేందుకు అనుమతి ఉండేది కాదు. అయితే కొన్ని చట్టాలని సుప్రీం కోర్టు 2002 జనవరి 26న అమల్లోకి తెచ్చింది. అయితే చట్టాలు భారత జాతీయ పతాక నియామవళి కిందికి రాకపోయినా తప్ప నిసరిగా పాటించాలని కోర్టు సూచించింది.

### కొన్ని నియమాలు..

* జాతీయ పతాకాన్ని ఎలాంటి ప్రకటనలకు వినియోగించరాదు.
* అలాగే పతాక స్తంభంపై ఎలాంటి గీతలు కానీ ప్రకటనలు కాని ఉండరాదు.
* విశేష అలంకరణగా జెండాను వాడరాదు.
* పతాకం ఎప్పుడు నేలను, నీటిని తాకరాదు. విగ్రహాల మీద, సన్మానాలకు వినియోగించరాదు.

### జెండావిష్కరణ నిబంధనలు..

జెండాలో మూడు రంగులు సమానంగా ఉండాలి. కాషాయపు రంగు జెండాలో పైభాగంలో మధ్యలో తెలుపు కింది భాగంలో ముదురు ఆకుపచ్చ ఉండాలి. మధ్యలో 24 చువ్వలతో నీలం రంగులో అశోక చక్రం తప్పనిసరి ఉండాలి. జెండా పొడవు, వెడల్పులు 3:2గా ఉండాలి. పతాకాన్ని ఖాదీ, చేనేత వస్త్రాలతో తయారు చేసిందై ఉండాలి. ఇతర వాటితో చేసిన పతాకాన్ని ఎగురవేస్తే శిక్షార్హులు అవుతారు. జెండా ఎగురు వేసే సమయంలో కాషాయపు రంగు పై భాగంలో ఉండాలి. జెండాను వాతావరణ పరిస్థితుల కనుగుణంగా సూర్యోదయం వేళలో ఎగుర వేసి సూర్యస్తమయ సమయంలో అవనతం చేయాలి. స్టేజీలపై ప్రసంగకర్తల కుడివైపు జెండా ఉండాలి. జాతీయ జెండాకు సమానంగా ఇతర ఏ జెండాలను ఎగురవేయరాదు. జాతీయ జెండాను ఊరేగింపుల్లో, కవాతుల్లో ఇతర జెండాలతో కలిసి తీసుకెళ్లేటప్పుడు ఇతర జెండాల కంటే ముందన ఉండాలి. లేదా కుడి వైపు అయినా ఉండాలి. జెండాను ఎగుర వేసేటప్పుడు అవనతం చేసేటప్పుడు జెండాకు అభిముఖంగా మనం ఉండాలి. ఎగురవేసేటప్పుడు వేగంగా, అవనతం చేసేటప్పుడు మెల్లగా దింపాలి. ఉద్దేశ పూర్వకంగా జెండాను అవమానించడం వంటి చర్యలకు పూనుకుంటే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవు.

## అవిశ్వాసం టెన్షన్

**రేపటి పాలమూరు మున్సిపల్ అవిశ్వాసం వీగేనా.. నెగ్గేనా..?**

- ఇరు పార్టీలకు సమానంగా..
- కాంగ్రెస్‌తో జతకట్టిన బీజేపీ
- హస్తం పార్టీ నేతల ప్లాన్‌కు చెక్ పెట్టేందుకు బీఆర్‌ఎస్ రెడీ
- కౌన్సిలర్లను గోవా టూర్‌కు తీసుకెళ్లిన అధికార పార్టీ నేతలు
- అధికార దాహానికి పరాకాష్ట : వైస్ చైర్మన్ గణేశ్

మహబూబ్‌నగర్ (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 25 : పాలమూరు మున్సిపాలిటీలో అవిశ్వాస ఘంటికలు మోగుతున్నాయి. ఈనెల 27న జరిగే అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా!? వీగిపోనున్నదా..? అన్న ఉత్కంఠ నెలకొన్నది. దీంతో పట్టణం లో రాజకీయం రసవత్తరంగా మారింది. వీగిపోయేలా చేసేందుకు బీఆర్‌ఎస్ రెడీ కాగా.. ఎలాగైనా నెగ్గించుకోవాలనిహ స్తం నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

### రెండు పార్టీలకు సగం.. సగం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో 49 మంది కౌన్సిలర్లకుగానూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శిబిరాల్లో చెరి సగం మంది ఉన్నారు. అధికార పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ఎట్టి పరిస్థితుల్లోనూ వీగిపోయేలా చేసేందుకు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు తీర్మానాన్ని నెగ్గించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు కౌన్సిలర్లకు భారీగా నజరానాలు ముట్ట చెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం జరిగే అవిశ్వాస తీర్మాన ప్రక్రియపై అందరి దృష్టి పడింది. అధికారం చేజిక్కించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ అడ్డదారులు తొక్కుతోందనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ప్రస్తుతం బల్దియాలో అత్యధికంగా బీఆర్‌ఎస్‌కు 30 మంది కౌన్సిలర్లు ఉన్నారు. కాంగ్రెస్‌కు ఐదుగురు, బీజేపీకి ఐదుగురు, ఎంఐఎంకు నలుగురు, స్వతంత్రులు ఐదుగురు ఉన్నారు. కాగా జాతీయస్థాయిలో కాంగ్రెస్, బీజేపీలు కయ్యానికి దిగుతుంటే.. ఈ మున్సిపాలిటీలో మాత్రం కమలం పార్టీ.. హస్తానికి మద్దతు పలుకుతుండడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

### రేపే ఓటింగ్

అయితే ఇండిపెండెంట్లు, స్వతంత్రుల సహకారం.. నలుగురు బీఆర్‌ఎస్ రెబల్స్‌తో కలిపి కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చింది. దీనికి స్పందించిన కలెక్టర్ 27న మహబూబ్‌నగర్ మున్సిపల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. కాగా కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎంతోపాటు నలుగురు బీఆర్‌ఎస్ తిరుగుబాటు కౌన్సిలర్లను కలిపితే 19 మందికి చేరింది. 30 మందిలో బీఆర్‌ఎస్ వైపు 20 మంది ఉండగా.. మరో ఐదుగురు అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా నిలుస్తున్నారు. ఇక మరో ఐదు మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతుండగా.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ బలం సరి సమానంగా మారింది. దీంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా చేసేందుకు మాజీ మంత్రి రంగంలో దిగారు. కాగా అధికార పార్టీ మున్సిపాలిటీని చేజిక్కించుకునేందుకు భారీగా ఖర్చు పెడుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా కొంతమంది కౌన్సిలర్లను ఆ పార్టీ నేతలు గోవా టూర్‌కు తీసుకెళ్లడం చర్చనీయాంశమైంది. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేస్తే భారీగా నగదు.. వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇస్తామని ఆశ చూపుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా పార్టీ సింబల్‌పై గెలిచి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి కాంగ్రెస్ పార్టీలో చేరిన నలుగురు కౌన్సిలర్లను అనర్హత వేటు వేయాలని బీఆర్‌ఎస్ నాయకులు కోర్టును ఆశ్రయించారు. ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మరోవైపు బీఆర్‌ఎస్ పార్టీ అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని విప్ జారీ చేసింది. ఒకవైపు కోర్టులో కేసు.. మరో వైపు విప్ జారీ కావడంతో గులాబీ పార్టీలో ధీమా వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్‌లో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అడ్డదారులు తొక్కుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గనీయబోమని మున్సిపల్ వైస్ చైర్మన్ తాటి గణేశ్ తేల్చి చెప్పారు.

### అవిశ్వాస తీర్మానానికివ్యతి రేకంగా..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయించి అధికార పార్టీకి గట్టి షాక్ ఇచ్చేందుకు బీఆర్‌ఎస్ పావులు కదుపుతున్నది. ప్రస్తుతం కొంతమంది కౌన్సిలర్లు ప్రలోభాలకు లొంగి కాంగ్రెస్ పార్టీ వైపు వెళ్లినా.. మిగతా కౌన్సిలర్లందరినీ పార్టీ నేతలు జంప్ కాకుండా చూస్తున్నారు. మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మానాన్ని ఛాలెంజింగ్‌గా తీసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎట్టి పరిస్థితుల్లోనూ తీర్మానాన్ని విఫలం చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. కౌన్సిలర్లు చేజారకుండా చూస్తున్నారు. అధికార పార్టీని దెబ్బ కొట్టేందుకు భారీ స్కెచ్ వేస్తున్నారు.

### కౌన్సిలర్లకు 'తాయిలాలు'

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ పార్టీ అనైతిక కార్యకలాపాలకు శ్రీకారం చుడుతోంది. స్థానిక సంస్థలను తమ గుప్పిట్లో ఉంచుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులో భాగంగానే మహబూబ్‌నగర్ మున్సిపాలిటీని కైవసం చేసుకునేందుకు ఆ పార్టీ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుత బల్దియాలో ఆ పార్టీకి కేవలం ఐదుగురు కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. ఇటు బీజేపీ, ఎంఐఎం, స్వతంత్రుల మద్దతుతోపాటు బీఆర్‌ఎస్ నుంచి కొందరు కౌన్సిలర్లను లాగేందుకు భారీ నజరానాలను ఇస్తుందని ప్రచారం జరుగుతున్నది. చైర్మన్ పదవి ఆశిస్తున్న ఓ చోటా లీడర్ తనకు మద్దతిస్తున్న కౌన్సిలర్లను తీసుకొని గోవాకు విహారయాత్రకు వెళ్లినట్లు సమాచారం. మరోవైపు అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తే మళ్లీ కౌన్సిలర్ టికెట్‌తో పాటు కార్లు, ప్లాట్లు ఇస్తామని ప్రలోభాలకు దిగారు. కాగా ఇదివరకే ఆయా వార్డుల్లో పార్టీలో పని చేస్తున్న సీనియర్ నేతలు దీనిపై భగ్గుమంటున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి అన్నీ చేస్తే పదేండ్ల నుంచి జెండా మోసిన తమ గతేం కావాలని నిలదీస్తున్నారు.

### కాంగ్రెస్‌తో బీజేపీ చెట్టాపట్టాల్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటి కావడం చర్చనీయాంశంగా మారింది. కేంద్రంలో ఈ రెండు జాతీయ పార్టీలు కయ్యానికి కాలుదువ్వుతుంటే.. ఇక్కడ మాత్రం కలిసి పనిచేయడం విడ్డూరంగా ఉందని జనం అంటున్నారు. అధికారం కోసం ఈ రెండు పార్టీలు ఒకటి కావడంపై విమర్శలు వస్తున్నాయి. తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో కాంగ్రెస్ ఇతర పార్టీల నుంచి గెలిచిన కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇంకో ఏడాది కూడా లేని పదవి కన్నా ఆ పార్టీ ఇచ్చే తాయిలాల కోసం కౌన్సిలర్లు సిద్ధాంతాలను వదిలేశారు. పార్టీ గుర్తులపై గెలిచిన కౌన్సిలర్లు ప్రలోభాలకు లొంగడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

### 27న ప్రత్యేక సమావేశం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ లో ఇప్పుడున్న పాలకవర్గంపై అవిశ్వాసాన్ని ప్రకటిస్తూ కొంతమంది కౌన్సిలర్లు ఇచ్చిన నోటీసులను పరిగణలోకి తీసుకున్న కలెక్టర్ 27న మున్సిపల్ ప్రత్యేక సమావేశానికి శ్రీకారం చుట్టారు ఈ సమావేశంలో పాలకవర్గంపై అవిశ్వాస ప్రకటన పైనే ఓటింగ్ నిర్వహిస్తారు. 49 మంది కౌన్సిలర్లలో బీఆర్‌ఎస్‌కు 30 మంది, కాంగ్రెస్‌కు ఐదుగురు, బీజేపీకి ఐదుగురు, ఎంఐఎంకు నలుగురు, స్వతంత్రులు ఐదుగురు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు నలుగురు కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ పార్టీపై తిరుగుబాటు ప్రకటించి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ సింబల్‌తో గెలిచిన వీరిని అనర్హులుగా ప్రకటించాలని ప్రస్తుత చైర్మన్ నరసింహులు కోర్టులో కేసు వేశారు. ఇది ఇంకా పెండింగ్‌లోనే ఉన్నది. మరోవైపు బీఆర్‌ఎస్ పార్టీ అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఓటు వేయాలనుకున్న కౌన్సిలర్లకు విప్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా..? వీగిపోతుందా..? అనే ఉత్కంఠ నెలకొన్నది.

**కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతాం**

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో అడ్డదారుల్లో అధికారం చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తుంది. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం. కొందరు కౌన్సిలర్లను ప్రలోభపెట్టి తమ వైపునకు తిప్పుకున్నా.. అంతిమ విజయం మాత్రం బీఆర్‌ఎస్‌దే.. అవిశ్వాస తీర్మానాన్ని ఓడించి సత్తా చాటుతాం.. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతాం.

- తాటి గణేశ్, వైస్ చైర్మన్, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ

## భౌతిక దాడులకు భయపడం

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- దళితబంధుఇ వ్వలేదనిఎం పీపీ శ్రీధర్‌రెడ్డిపై కాంగ్రెస్ గుండాల దాడి
- బీఆర్‌ఎస్‌శ్రే ణులరా స్తారోకో

పాన్‌గల్‌లో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పాన్‌గల్, జనవరి 25 : కాంగ్రెస్ నాయకుల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకొని భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. తమకు దళితబంధు రాకుండా ఎంపీపీ అడ్డుకున్నాడనే నెపంతో కాంగ్రెస్ గుండాలైన ఆది శ్రీను, ఆదిస్వామి మద్యం తాగి పాన్‌గల్ మండల ఎంపీపీ శ్రీధర్ రెడ్డిపై దాడికి పాల్పడిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో పెద్దమ్మ గుడి దగ్గర ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి కూర్చొని మాట్లాడుతుండగా అటుగా ఆది శ్రీను, ఆదిస్వామి పూటుగా మద్యం తాగి వచ్చి ఎంపీపీపై పిడిగుద్దులతో దాడికి పాల్పడ్డారు. అప్పటికే వారితో ఉన్న డీజిల్ ఆయనపై చల్లారు. పక్కనే ఉన్న ఎంపీపీ అనుచరులు దాడిని నిలువరించడంతో అక్కడి నుంచి కాంగ్రెస్ గుండాలు పారిపోయారు. ఎంపీపీ వెంటనే తన అనుచరులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో వారిపై ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం మండలకేంద్రం బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ వచ్చి రోడ్డుపై ధర్నా చేపట్టి నిరసన చేపట్టారు. పోలీసులు జోక్యం చేసుకొని నిరసన ఆపే ప్రయత్నం చేశారు. దాడికి పాల్పడిన వారిని శిక్షించేవరకు ధర్నా ఆపేది లేదని భీష్మించుకున్నారు. ఎట్టకేలకు నిందితులను అరెస్టు చేసి 307 హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

### మాజీ ఎమ్మెల్యే బీరం పరామర్శ

ఎంపీపీ శ్రీధర్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డారనే విషయం తెలుసుకున్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఎంపీపీ ఇంటికి చేరుకొని పరామర్శించారు. జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతనెల పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లిలో మాజీ సైనికుడు మల్లేశ్ హత్య మరువకముందే మళ్లీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డిపై దాడికి పాల్పడడం దురదృష్టకరమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదని, దాడి వెనుక మంత్రి జూపల్లి కృష్ణారావు హస్తముందని ఆరోపించారు. స్థానిక ఎస్సై పనితీరు బాగాలేదని, పోలీసు యంత్రాంగం పక్షపాత ధోరణిని మంచిపద్ధతి కాదని తెలిపారు. చిల్లరమల్లర బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, ఇలాంటి చేష్టలకు పాల్పడితే సహించేది లేదన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులకు పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, గెలిచినంత మాత్రానా కాంగ్రెస్ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడితే సహించే ప్రసక్తి లేదన్నారు. గత ఐదేండ్లలో నియోజకవర్గంలో ఎలాంటి దాడులకు పాల్పడకుండా ప్రజాపాలన అందించామని బీరం సమావేశంలో గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రంగినేని అభిలాష్‌రావు, చంద్రశేఖర్‌నాయక్, వెంకటయ్యానాయుడు, దశరథ్‌నాయుడు, ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, జనవరి 25 : పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తిమ్మాజిపేట, తాడూరు మండలాలకు సంబంధించిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలే పార్టీకి కథానాయకులని, వారి జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా వారిపై ఒత్తిడి తేవాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కార్యకర్తల వల్లే ఇన్నేళ్లుగా పార్టీ బలంగా ఉందని, కేసీఆర్‌పై ప్రజల్లో సానుభూతి వెల్లువలా ఉందని, ఈ పరిస్థితిని పార్లమెంట్ ఎన్నికల్లో సానుకూలంగా మలచుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికలో ఓటమికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. పార్టీకి ప్రభుత్వానికి సమన్వయం లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి ఎదురైందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారన్నారు. సోషల్ మీడియాలో జరిగిన అసత్య ప్రచారాన్ని మనం గట్టిగా తిప్పికొట్టలేకపోయామన్నారు. మనం ఇంకా మాట్లాడడం మొదలుపెట్టకముందే కాంగ్రెస్ వారు ఉలికిపడుతున్నారన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఇంకెలా ఉంటుందో ఊహించుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉదాసీన వైఖరి, మీమాంస వీడాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఏం మాట్లాడారు ఇప్పుడేం చేస్తున్నారో ప్రజలకు విడమరిచి చెప్పాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్ యాదవ్‌తోపాటు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు 'డబుల్' ఆనందమెప్పుడు..?

- అభద్రతా భావంలో లబ్ధిదారులు
- తాసీల్దార్,ఆ ర్‌డీవో కార్యాలయాల ఎదుట ఆందోళనలు

కల్వకుర్తిలోని పాలమూరు చౌరస్తాలో ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

కల్వకుర్తి, జనవరి 25 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. లబ్ధిదారులుగా ఎంపికైన తమకు డబుల్ బెడ్రూం ఇండ్లను ఇవ్వకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు రెండు పడకల ఇండ్లను వెంటనే అప్పగించాలని ఆందోళనకు దిగుతున్నారు. లబ్ధిదారులుగా ఎంపికై చాలా రోజులు కావస్తున్నదని.. ఎందుకు తమకు ఇండ్లు కేటాయించడంలే దనిప్రశ్నిస్తున్నారు.

### కేసీఆర్ ప్రభుత్వంలో..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కల్వకుర్తి మున్సిపాలిటీలో 99 సర్వేనెంబర్ ప్రభుత్వ భూమిలో 240 డబుల్ బెడ్రూం ఇండ్లను కట్టించారు. డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీకి సిద్ధం చేసి అందుకోసం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక కోసం అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఇండ్లకు ముగ్గురి చొప్పున అర్హులను ఎంపిక చేశారు. ముగ్గురిలో ఒకరి ఇల్లు కేటాయించేందుకు వీలుగా కలెక్టర్ నేతృత్వంలో స్థానిక ఫంక్షన్ హాల్‌లో లక్కీడీప్ నిర్వహించారు. అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆధ్వర్యంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ 240 మంది లబ్ధిదారులను లక్కీడీప్ ద్వారా ఎంపిక చేశారు. డబుల్ బెడ్రూం ఇండ్లలో పెండింగ్ పనులను పూర్తి చేసి త్వరలో వాటిని అప్పగిస్తామని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో లబ్ధిదారులకు ఇండ్ల పంపిణీ ప్రక్రియ వాయిదా పడింది.

### కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా.. డబుల్ బెడ్రూం ఇండ్ల ఊసే ఎత్తకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. ఇంతకు తమకు డబుల్‌బెడ్రూం ఇండ్లు ఇస్తారా.. ఇలాగే కాలాయాపన చేస్తారా అన్న అభద్రతా భావం లబ్ధిదారుల్లో మొదలైంది. ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి ఫలితంగా లేకపోవడంతో లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకొని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంను కలిసి వినతిపత్రం ఇచ్చారు. డబుల్ బెడ్రూంల వద్ద కరెంట్, తాగునీరు తదితర వసతుల కల్పించి త్వరలో అప్పగిస్తామని హామీ ఇచ్చారు.

## ఆత్మకూరులో దారుణం

- ఐదేండ్ల చిన్నారిపై లైంగికదాడి
- పోక్సో చట్టం కింద కేసు నమోదు

ఆత్మకూరు, జనవరి 25 : ఆత్మకూ రు పట్టణంలోని దారుణం చోటుచేసుకున్నోది. ఐదేండ్ల చిన్నారిపై 17 ఏండ్ల బా లుడు లైంగికదాడి చేశాడు. ఈనెల 22న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటనపై చిన్నారి తల్లిదండ్రులు ఈనెల 24న పోలీసులకు ఫిర్యాదు చేయగా డీఎస్పీ ఆనందరెడ్డి నేతృత్వంలో విచారణ జరిగింది. సీఐ కేఎస్‌రత్నం, ఎస్సై నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన 17 ఏండ్ల బాలుడు చిన్నారికి చాక్లెట్లు ఇప్పించి ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు చెప్పారు. రెండ్రోజుల తరువాత చిన్నారి జరిగిన ఘటన తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సంరక్షణలో చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహించగా గురువారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు. అయితే నిందితుడు సహితం మైనర్ కావడంతో జువైనల్ హోమ్‌కు తరలిస్తున్నట్లు సీఐ రత్నం పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.